# జీవ - ఫలం

జ్ఞాపకం ఉందా?— మీరందరూకూడా బహుశః చూసేఉంటారు: తారీఖు సరిగా గుర్తురావడంలేదు కాని, ఆంధ్రపత్రిక వెనుక పేజీనిండా అన్నీ అలాటి బొమ్మలే. ఎడమచేతివైపున, క్రిందనుంచి ఎగువకు రెండోచిత్రం— తెలిసిందికాదూ? అందరికన్నా, ఎంత అందంగా ఉన్నారు- అచ్చులోనైనా—ఆ దంపతులు!

మీరందరూ చూసి...అప్పటికి హాయిపడి, ఆ మరుక్షణంలో ఆ మొగాలను మరచిపోయిఉంటారు. నేను, చూడగానే, నవ్వడం మొదలుపెట్టాను...ఆసంగతి అనుకుంటే సరి, ఇప్పటికీ నాకు నవ్వు ఆగదు.

అందుకు ఎంతగాథ ఉందని?

—రోహిణి రెండోపాదం; నిప్పులు చెరుగుతూంది:

అన్నీ, అద్దాలతలుపులు ... అన్నింటికీ అంతో యింతో పగులు...ఆపుదల ఏమీలేదు ... ఇక నాఅవస్థ చెప్పాలా? —అయినా, అలాగే మంగలంలోపడి వేగుతూ ముచ్చెమటలు ధారకడుతూంటే మోచేయిక్రింద అద్దుడు కాగితం పెట్టుకుని...ఎలాగో ప్రూఫ్‌లు సరిచూస్తున్నాను. తోడు ఎవరూలేరు. బుద్ధిపొరబడి...చేతిక్రింద కుర్రవాడిని గొంతుతడుపుకొనేందుకు, "రెండుసోడాలు తీసుకరారా నాయనా" అని పంపితే ... అప్పటికి గంటఅయింది...

వాడిది అదే పోక,— క్రిందనుంచి, అచ్చుపనివాళ్ళు... కాఫీ అందీయలేకపోతున్నానని మోత—ప్రభూ! పత్రికా సంపాదకుడి బ్రదుకు—పగవాడికన్నా వద్దు—

—ఢూకుడుగా మెట్లమీద బూటుచప్పుడైతే— ఎవరావచ్చేది, మనకోసం ఆ మిడసరిలగ్నాన అని...చేసే పని ఆపి, కలం పళ్ళసందున కటకటలాడిస్తూ పరకాయించాను...అవతలవైపునుంచి తలుపుఅద్దంమీద టక-టక-పిలుపుమోగింది. కలం బల్లమీదకు విసిరేసి "లోపలకు రండి" అని, పక్కకుర్చీలోంచి, కాగితాలూ పుస్తకాలూ తీసి చోటుచేశాను.

నాలుగుమూలలా చూసి ... నావంక రెప్పవేయకుండా ఇంకా నిదానంగాచూసి, "మీరేనా-ఫలానా..." అన్నాడు. నేను అవునని, తల ఊగించగానే "నేను—ఫలానా" అని తానెవరో చెప్పాడు. నేను చాలా సంతోషించాను, విని. అదివరకు ఎన్నికథలో ప్రకటించాను... ఉత్తరాలద్వారా దస్తూరి పోలికే కాని, ఆ భాగ్యశాలి పరిచయం అదివరకు నాకు లేదు.

"పత్రిక (నెలనెలా) అందుతున్నదా?" అదీ నాలుక చివరను మొదట ఆడిన ప్రశ్న . . . యీవృత్తిలో అలవాటయింది.

"ఆహాఁ...అందుతూనే ఉంది. ఆలస్యంచేయకుండా నా కథలు అందిన వెంటవెంటనే ఆసంచికలోనే ప్రకటిస్తూన్నారు...అందుకు—"

"అది మా విధి; చక్కనిసామాగ్రి జతకూడినప్పుడు

వినియోగించకపోతే... పాఠకులకు ఏం బదులు చెప్పగలుగుతాము."

"అందరు సంపాదకులూ, అలా అనుకున్నట్లయితే–యీపాటికి, కవులందరూ కలకలలాడుతూ ఉండకపోయినారా?"

"ఏమోలెండి...ఎవరిభాగ్యం వారిది?

ఆలా అని ఊరుకుంటున్నారా, మరి, ఎలికమీద పిల్లిని ఎక్కించకుండా..."

—సంభాషణ సజావైన ధోరణిమారి, శ్రుతిమించే పాకంలోకి వస్తూంది: యిదేచావు వీళ్ళతో ... మాకూ మాకూ అసలే అంతంత సయోధ్య: అందులో ఈమధ్య వాళ్ళు వచ్చి, గాలిపోగుచేసి అక్కడిమాట యిక్కడా—ఇక్కడిమాట అక్కడా ఊది, చేతులుదులుపుకొని తమ దోవన్ను తాము పోతారు: ఇక్కడ కొంపలంటుకుంటాయి.

నేను జవాబుచెప్పకుండా, ఆమాట వినిపించుకోకుండా ఉండడంచూసి, ఆతడూ మౌనందాల్చాడు. ఆ నిశ్శబ్దం మరీ కంటకంగా ఉంది...ఏమయేదోకాని, ఇంతలో ఎంతసేపటిక్రిందనో అదే పోకపోయిన బాయ్ సోడాలు పట్టుకువచ్చాడు...

పుచ్చుకోనన్నాడు...నేను బలవంతంచేయకపోతే బాగుండదాయెను...అందుకోసం, అదికాదని, కుర్రవాణ్ణి టీ తీసుకురమ్మని మళ్ళా పంపాను...యీలోపల యిద్దరం సిగరెట్లు ముట్టించాము...

"ఏమండీ...ఎవరా అమ్మాయి?" — ఉపోద్ఘాతం

ఏమీ లేకుండా, ఏమాత్రమూ తడుముకోకుండా ప్రయో గించాడు .ఆ ప్రశ్న. నా కెలా అర్థంఅవుతుందీ?

"ఎవరు?"

"ఆమే ... మీ పత్రికలో వారం వారం కథలు వ్రాస్తూన్నది. మేమిద్దరమే కదా...ఎవరని అడుగుతారేం?"

"ఓహో...ఆమా.."

"అవును..."

"తెలియదు..."

"తెలిసినా చెప్పరన్నమాట?"

"నామాటకు అన్నమాటలుండవు."

ఇద్దరం, ఒకరినిచూసి ఒకరం కొరకొరలాడాం?— నామాటకు అతనికి కోపంరావచ్చునూ?— అతని ధూకు డును నేను సహించాలీ?— కాని మనకోసంవచ్చిన పరాయి పెద్దమనిషితో మన విడిదిలో తగవులాడటం మంచిదికాదు కనుక —

"అవునండీ ... ఆమె ఎవరో నాకు తెలియదు... ఎంతవయసో, కను ముక్కు తీరు ఎలాఉంటుందో...ఇవన్నీ కనుక్కోవలసిన అగత్యం ఏం ఉంది?— కావాలంటే చిరు నామా మాత్రం సప్లయిచేయగలను. ఆమీద "దేవర చిత్తము..." అని సర్ది చెప్పినా...ఆ వాలకంలోనూ అప్ర యత్నంగా కొంచెం కొంటెతనం మెరిసినందువల్ల...అతనికి మళ్ళా కోపం వచ్చేస్తూంది—

టీ వచ్చింది...దైవకృపవల్ల...యిద్దరం పుచ్చు కున్నాం. తాంబూలం.. సిగరెట్లూ...

—అతడు గడియారంవంక చూశాడు. నేను చెక్ బుక్ తీసి...అతనికి నా తాహతుకు తగిన ప్రతిఫలం—అంకె వేసి...అందిచ్చి... 'చంద్రుడికి నూలుపోగు అనుకోవలసిందే' అని నవ్వుతూ అన్నాను...

ఆతడు మెదలకుండా తీసుకుని మడిచి పర్సులో పెట్టుకుని...ఆమె అడ్రసు అడిగి పుచ్చుకుని...సెలవుపుచ్చుకుంటా నన్నాడు...

'మీరు ఇక్కడ ఉన్నంతలో, తీరుబడి అయినప్పుడల్లా, యిక్కడికి దయచేస్తూంటే చాలా సంతోషిస్తాను... అని మనస్ఫూర్తిగా కాకపోయినా, మాటవరుసకన్నా అన్నాను.

ఆతడు మెట్లుదిగి వెళ్ళిపోయిన తరువాత...నిర్వేదంతో నిట్టూర్పు విడిచాను: ఆశాభంగం అయింది: నే ననుకున్నాను కదా...కథలలో అంత భాగ్యం, సంపదా చిందించే కథకుడు లోభిగా ఉండి మనం అతికష్టంమీద యిచ్చే తృణానికి ఆశించుతాడా...ఆఫరుచేయడం మనకు దర్జా...ఆతడు మర్యాదగా అది అక్కరలేదని తిరిగి యిచ్చేయడమే కాకుండా, మన కష్టసుఖాలు కనిపెట్టి ఏ మహారాజ పోషకుడుగానో వేసుకోమని...మన చెక్కుకు తన చెక్కు జోడించితే—ఎంత బాగుండేది...అత్యాశకు పోతే యింతే అవుతుంది కాబోలు...ఆ నాలుగురాళ్ళూ ఉంటే యీ వారం పత్రిక పోస్టులో వెళ్ళేది...ఇప్పుడు దారి?

—అలాటి తవాయీలు తగలడం అదే మొదటిసారి కాదు కనక...ఓ పావుగంట మనసులో బాధపడ్డా, మొండి

కేయడం కష్టంకాలేదు...కానీ అనేది ఎప్పటి కప్పుడు, తడుముకోకుండా కనబడేవాడికి గాలిలో మేడలు కట్టడం చేతనవుతుందా...అయినా ఉత్తరక్షణంలో ఏం జరుగుతుందో మనకేం తెలుసును, మంచో చెడో?...

మళ్ళా తలుపు చప్పుడైంది:

అయిదు కావచ్చింది...ఇక పైమీద బట్ట వేసుకుని బయటికి నడవచ్చునుకదా అని అనుకుంటూన్నాను. కాని...

తలుపు తీసే దిక్కు కూడా లేదు...ఆ క్షుద్రవేధవ వాడికి నిజంగా జీతం యివ్వడం శుద్ధ దండుగ...నిమిషం వాడికి కాలు అక్కడ నిలువదు...

—కొంచెం విసుగుతో లేచివెళ్ళి తలుపుతీశాను-ఆ తలుపులతో అదో గొడవవచ్చింది...దగ్గరగా గడియ లేకుండా వేసి ఉంచుదామా అంటే, రవంత గాలిసాగితే అద్దాలు పప్పు—పప్పు అవుతవి—అందుకని—

—గుమ్మంలో ఎదురుగుండా నవ్వుతూ — ఆమె నిలుచుని వుంది...

ఆ అమ్మాయి ఎవరో అప్పుడు నాకు తెలియదుకదా. ఎవరా అని ఆశ్చర్యపడుతూనే...కలవరపాటుతో లోపలకు ఆహ్వానించాను...సిగ్గువేస్తూంది, ఆ పాతకుర్చీలో ఆమెను కూర్చోమనడం...కాని, మనభాగ్యం అంతేనాయెను...

మనకు సహజంగాఉండే బిడియంతో, నేను సంకోచంతో మాటాడుతున్నాను: కాని ఆ అమ్మాయి చాలా బోళాగా...అతి చనువుగా...నేను ఒకమాట తెములుచ్చుకొనేలోపల తాను పదిమాటలుగా...నా గుండె కొంచెం

కుమటపడేసింది: ఇంతకూ ఆమె ఎవరో తెలుసునా...నా పత్రికకు అంత ప్రసిద్ధిని తెస్తూన్న ఆ కథలు...లోకంలో వున్న బాధను, దరిద్రుల బాధలను...గుండెలు మండిపోయే టట్టుగా...అంత ప్రత్యాక్షానుభవంతో చిత్రిస్తూన్నవి... అవి వ్రాసేది ఆ అమ్మాయే ...

ఆమె, దయతో నన్ను చూడటానికి వచ్చినందుకు నిజంగా నాకు ఏనుగునెక్కినంత సంతోషంగా ఉంది...

కాని, యెంత దౌర్భాగ్యం...ఆమెను బహూకరించ డానికి...ఆమాట అలా ఉండగా, ఆఖరుకు కాఫీ తెచ్చి యివ్వడానికైనా పైసాలేదు...

ఆమె, ఎదురుగుండా కూర్చుని మాటాడుతూంది... వింటున్నాను...నిజంగా ఆ ప్రశంసకు ఎంతైనా వుబ్బి పోవచ్చును: నాకృషినీ-నాపత్రికనూ ఎక్కడో ఆకాశానకు ఎత్తుతూంది. కాని నా ధ్యాసఅంతా అక్కడలేదు...కళ్ళ ఎదురుగుండా ఖాళీపర్సు బావురుమంటూ కనబడుతూంది... కలగా...పచ్చకాగితాలు...నాకు అంత కలిమిఉంటే... ఆమెరుణం కొంతవరకన్నా తీర్చుకోగలిగేవాడిని కదా! ఏమో ఎప్పటికన్నా కల నిజమైతే—

కల నిజంకావడం—నిజంగా దారుణం...

—మనకళ్ళను మనం నమ్మకపోవడమనేది ఏమిటో మనకు ఎన్నడూ ఇదివరలో అనుభవంకాలేదు: కాని... కళ్ళఎదుట, బల్లమీద...అలా ఆ దొంతరవుంటే...

'నేను చాలా సంతోషిస్తాను...మీరు మొగమాట పడకుండా తీసుకోవాలి ... మీకూ, మీరు సారస్వతానికి

చేస్తూన్న సేవకూ...మేం ఎవరమూ ఎన్నడూ విలువ కట్టలేం. అందుకు కాదు...ఎప్పటికీ పసిపాపగానే వుండదు కదా, ప్రాకులాడుతూ, పత్రిక? పెరిగి పెద్దదౌతూన్న కొద్దీ, వన్నెలకూ చిన్నెలకూ...మీదే అంతా భారం అయినా, మా ముద్దూ ముచ్చటా మేమూ తీర్చుకునేందుకు మీరు అనుగ్రహించి అనుజ్ఞయివ్వాలి...తప్పదు...'

ఆ అమ్మాయిని అగౌరవించినట్లు కాదూ, అప్పుడు నేను తీసుకోకుండా వుంటే...నా కనులే కాదు, మనసూ చల్లబడ్డది. కాని...ఎంత సిగ్గువేసింది?

'వెళ్ళి వస్తానండీ' అంటూ ఆమె లేచింది.

'మళ్ళీ తప్పకుండా—రండి' చాలా వినయంతో, హృదయంతో అన్నాను: ఆమె నవ్వుతూ...

'ఏలాగూ తప్పదు లెండి; నేను వస్తున్నాను కదా అని పోస్టులో పంపకుండా వెంట తీసుకువచ్చాను...ఇవాళ యిక్కడకు వద్దాం అనుకోకుండా బయలుదేరాను...అందు చేత రేపు పట్టుకు వస్తాను, కథలు...'

—గడియారం అరగంట కొట్టింది. కుర్రవాడు వచ్చి ...టోపీ తిసుకుని ... 'వేళఅయింది, కిటికీలు మూసి వేయనా' అనే ప్రశ్న—చూపు చూశాడు. నేనూ ఉత్తరీయం అందుకున్నాను, ఆమెను సాగనంపవచ్చును కదా అని...

ఇంతలో...అతడు వచ్చాడు;

ఆమెవంక వింతగా చూసి...నన్ను సమీపించి,

'మీకు కొంచెం శ్రమ ... పరధ్యానంలోఉండి

ఇందాక తారీఖు ఇంకో నాలుగు నెలలకు వేశారు. నేనూ చూడలేదు. తీరా ప్రెజెంటుచేసేటప్పటికి...'

—చెక్ అందుకుని చూశాను. నిజమే, నాలుగుకు ఎనిమిదీ — ఎనిమిదికి నాలుగు...నెలా తేదీలు తారు మారుగా వేశాను. ఎన్నడూ లేదే అలా పొరబడటం... చెక్ బల్లమీద పడవేసి, జేబులోనుంచి, కాగితం తీసి యిచ్చాను: ఆతడు 'మార్చుకురానా' అనగానే నేను నవ్వి 'మార్చక ఏం చేస్తారు...కాని మళ్ళీరావడం ఎందుకు?' అన్నాను. ఆతనికి...అర్థం కాలేదు...

ఆ అమ్మాయి, చెక్ తీసి చూసింది...పేరుచదివి... నే నింకా ఒకరికొకరిని ఎరుకపరచాలా వద్దా అనే మీ మాంసలో ఉంటూండగానే...తానే కలిపించుకుని మాటా డింది. ఒకరినిచూసి ఒకరు 'ఓహో' అనుకున్నారు...ఎన్నా ళ్ళనుంచో ఎరుగున్నవాళ్ళలాగా...నామాటే మరచి పోయి...నావంకనైనా చూడకుండా మెట్లు దిగిపోతున్నారు ...నేను మండిగం రెండు కమ్ములూ పట్టుకుని ఆలాగే నిలు చున్నాను—

ఆ ధీరుడు మళ్ళా తల నావంక త్రిప్పనన్నా లేదు, మెదలకుండా ఎక్కి కూర్చున్నాడు: ఆ అమ్మాయి మాత్రం, అడుగు కారులో ఉంచుతూ నా వైపుచూసి చేయి ఊపింది ...రెండువేళ్లు కదుల్చుతూ...కారు నిశ్శబ్దంగా రయిున వెళ్ళిపోయింది...

—నేను నిజంగా నాఘాయూకు కుబేరుణ్ణి అయిపోయి నాను, ఆమె చలువచేత...ఇక పత్రికను ఎంతో బాగుచేయ

వచ్చును, ఎన్ని అందాలో తేవచ్చును: ఎందుకూ లోటు లేదు కదా...

అప్పుడు హడావుడిలో....ఆమెకు నాకృతజ్ఞతఅయినా తెలుపలేదు....మాట తెముల్చుకుని ఏమన్నా గోణిగే వాడినో ఏమోకాని, యింతలో ముంచుకుపోయినట్లు ఆ దరిద్రుడువచ్చి....అసలు ఆమెనే ఎగురవేసుకుపోయినాడు: రేపు వస్తుంది కదా, అప్పుడు యథోచిత మర్యాదలన్నీ చేయవచ్చును అని మనసును సమాధానపరచుకున్నాను.

మరునాడు ఆమె రాలేదు: పోనీ, ఆమరునటినాడైనా ...ఊహూఁ ..కథలు పోష్టుకూడా చేయలేదు:

మూడోనాడు మాత్రం.... నేను అప్పటికి ఎదురు చూడటం మానేశాను....ఉత్తరం...

ఆతడు వ్రాస్తాడూ—

'భాయిజీ !'

'మీకు...లోకానుభవం ఉందో లేదో నా కంత పరిచయంలేదు కనుక గట్టిగా చెప్పలేను కాని, కావ్యలోకానుభవం—పూజ్యం...అది నేను వెంటనే గ్రహించాను ...మీరు గమనించలేదు కాని.

నాకు అప్పుడే అర్థమయింది: చెకే వ్రాస్తూ నావంక చూశారే, 'ఏమిటి యీ భాగ్యవంతుడు మన పైసా ఆశించ వచ్చాడా, సరదాకు కథలు వ్రాస్తున్నాడు కాని'—అలా అనుకుంటున్నారని నేను వెంటనే కనిపెట్టి—మీ ముఖం మీదనే నవ్వడం బాగుండదని బలవంతాన మింగేసి ఊరుకున్నాను.

'అవును లెండి, మీ రిలా అనుకుని ఉంటారు. 'ఏ కథలో చూసినా అన్నీ సోఫాలూ, మార్బిల్ భవనాలూ, కార్లూ న్యూసాలిమర్లూ...ఆలాటి జీవితఛాయాలో వాడు కనుక నేంఅంత స్వానుభవంతో వ్రాస్తూన్నాడు...' అంతే కాదూ?

అంతా అబద్ధం...అది ఊహాగానం. అప్పుడు నేను అతి సామాన్యుణ్ణి (ఇప్పుడు?....చివరదాకా ఓపికపట్టి చదవండి!— మీరు చెక్, దయతలచి యివ్వకపోతే మనపని పస్తుఅయేది. తీరా కాళ్ళు యీడ్చుకుంటూ బ్యాంకుకు వెళితే—అక్కడ వాడు తిప్పికొట్టగానే నీళ్ళుకారిపోయినా ననుకోండి—మీరు అందుతారో, అందరో, అయితే ఏం కావాలి?—మీ మీద ఆశతో నే. పట్నంవచ్చింది...

వచ్చినందుకు...

చూశారా?—మీరు ఎంత అమాయకులో!

*   *   *   *

పేజీ తిరగగానే దస్తూరిలో మొగ—వరవడి అయిపోయింది. ఇక ఆమె—

"అన్నగారూ!"

"ఆయన పైన వ్రాసినట్లుగా—మీరు అమాయకులండి—నా కథలలో బాధ, దారిద్ర్యం పరమేశ్వరుడు నాకు ప్రసాదించకపోగా...కసితీర్చుకుంటూన్నట్టు...అతని కథల్లో అపురూపాలన్నీ అనుగ్రహించాడు.

"లేనివానికోసం కలలుకనడం — మానవసహజం అవునా కాదా?

కాని ఇంతకాలం—నాకు లేమి ఏదో తెలియకుండా మాయచేసింది—కలిమి—

ఇప్పుడు—ఈ కలిమి—

"ఇద్దరం...భాగ్యవంతులం"

*   *   *   *

ఇద్దరూ కలిసి ఇలా చిలిపిగా వ్రాశారు

"సంపాదకరాయా—

పాపం! మిమ్మల్ని తలచుకుంటే నిజంగా జాలివేస్తుంది. పేదకు పెన్నిధానం దొరికినతరువాత (ఇది కేవలం మా విషయంలో, స్వామీ! తమరు ఏ మాత్రమూ ఆగ్రహించకండి) ఇంకా ఎంతకాలం, బీదతనం...

"మనమందరం భాగ్యవంతులం—

"మీ పత్రిక కలకాలమూ వర్ధిల్లవలెనని—కాబోయే దంపతులు దీవించడంకన్న, మీకు కావాలసిందేముంది?

"కథలు—

అవును మీకెప్పుడూ అదే రంధి — మాకేం పని పాటలు లేకనా మీ పత్రిక నింపడం—

మీ మీద కోపంలేదు కనుక—కోపం ఎందుకంటారా, కాదా మరి, చక్కగా కథలు వ్రాసుకుంటూన్న వాళ్ళకు 'మల్లెపూల తెప్పకట్టి'—మీ పత్రికే కాదా.... ఇంతకూ మూలం?—మా అమ్మాయికి తప్పకుండా మన పత్రిక పేరు పెట్టుకుంటాం...దైవం రక్షించితే...

అవును, మీరుచేసిన—ఉపకారానికి?—మీ కంతే కావాలి?